క్లుప్తంగా

జూద కేంద్రంగా రేపల్లె తీరప్రాంతం



రేపల్లె రూరల్: కూటమి పాలనలో ప్రశాంతమైన రేపల్లె తీర ప్రాంతం జూద కేంద్రంగా మారిందని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరి రావు ధ్వజమెత్తారు. రేపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేకాట, కోడి పందేలు ద్వారా రోజుకు రూ.లక్షల్లో చేతులు మారుతూ ఎందరో జీవితాలు అంధకారమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా జూదాలు నిర్వహిస్తున్నా.. పోలీసులు పట్టీపట్టనట్లు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. ఒకపక్క అక్రమంగా ఇసుకను తరలిస్తూనే మరో పక్క కోడి పందేలు, పేకాటతో అక్రమంగా దండుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రతినిత్యం కోడిపందేలు విచ్చలవిడిగా జరుగుతున్నాయన్నారు. జూదాలను నియంత్రించేందుకు పోలీసులు తగు చర్యలు తీసుకోకపోతే పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకునే కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



నగరం: ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ బండ్ల భార్గవ్ తెలిపారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సోమవారం పరిశీలించి, మాట్లాడారు. ఈ నెల 28న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఎస్వీఆర్ఎం కళాశాలలోని పోలింగ్ బూత్‌లో కల్పించాల్సిన సౌకర్యాలపై కళాశాల యాజమాన్యంతో చర్చించినట్లు చెప్పారు. పోలింగ్ బూత్‌లో అన్ని వసతులు కల్పించేలా కృషి చేస్తున్నట్లు వివరించారు.అలాగే మండలంలోని ధూళిపూడి గ్రామంలో శ్రీతాళ్లమ్మ, వీరమ్మ, పేరంటాళ్లమ్మ దేవస్థానాన్ని ఎస్ఐ భార్గవ్ పరిశీలించారు. ఈ నెల 10, 11 తేదీల్లో తాళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ సీసీ కెమెరాలు భద్రత వలయంలో తిరునాళ్లకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి



వేమూరు: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఈ నెల 7న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని సోమవారం చలో హైదరాబాద్ పోస్టరు విడదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందాకృష్ణ మాదిగ నిర్వహించే సభకు వేలాది మంది మాదిగలు లక్షల డప్పులుతో కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్లు కూచిపూడి సురేష్, క్రాప నాని, చిలకా యోహాన్, కాళహస్తి గోపి, దున్నా నారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ చించివేత



బాపట్ల: పిట్టలవానిపాలెం మండలం గోకరాజునల్లిబోయినవారిపాలెం గ్రామంలో విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా అక్కడ ఉన్న వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీను కొంతమంది ఆగంతుకులు చించివేశారు. నాయకులు ఫొటోలను తొలగించడంపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ విషయంలో జోక్యం చేసుకుని ఫ్లెక్సీలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు ఏర్పాటు చేసిన జాబ్ మేళా కరపత్రాలను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి అంటించడంపై కూడా పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

6 నుంచి పునరుత్థాన పండుగలు

తెనాలిఅర్బన్: హోసన్నా ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8,9 తేదీల్లో పునరుత్థాన పండుగలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమరావతి ప్లాట్స్‌లోని స్టేడియం వద్ద రోజూ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కూడికలు జరుగుతాయని చెప్పారు. బ్రదర్ సాల్మన్ వాక్య పరిచర్య చేస్తారని, అందరూ పాల్గొనాలని కోరారు.

మంచి నీటి కాలుష్యం

- బాపట్లలో పట్టణంలో పైపు లైన్లకు లీకులు
- నీటి కాలుష్యంతో అల్లాడిపోతున్న ప్రజలు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- ప్రస్తావన లేని రెండో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణం



లీకులు నివారణ చేపడుతున్న మున్సిపల్ అధికారులు

బాపట్ల: బాపట్ల ప్రజలకు కలుషిత నీరే దిక్కయ్యింది. 35 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మంచినీటి పైపులకు ఎక్కడపడితే అక్కడ లీకులు అవుతున్నాయి. నీటి కాలుష్యం నివారించేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ యంత్రాంగం చేపడుతున్న పనులు సఫలీకృతం కావడం లేదు. దీంతో ప్రజలకు కలుషితమైన నీరే సరఫరా చేస్తున్నారు. మరోవైపు రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం ఊసే కనిపించడం లేదు.

పాత పైపు లైన్లతోనే..

బాపట్ల పట్టణంలో 125 కిలోమీటర్లు మేర మంచి నీటి పైపులైన్లు విస్తరించాయి. పట్టణ జనాభా 85 వేలకుపైగా ఉంది. ప్రతి మనిషికి సగటునా 25 లీటర్లు మంచి నీటిని అందించాల్సి ఉండగా ప్రస్తుతం బాపట్ల పట్టణంలో 14 లీటర్లు మాత్రమే అందిస్తున్నారు. పైపు లైన్ల లీకులు కారణంగా నీటి కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లీకులు ఇలా..

బాపట్ల పట్టణంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకులకు వెళ్లే ప్రధానమైన పైపు లైన్లకు లీకులు ఏర్పాడుతున్నాయి. గుంటూరు వెళ్లే రోడ్డు నుంచి పట్టణంలోని దగ్గుమల్లివారిపాలెం, వివేకానంద కాలనీ, ఉప్పర పాలెం, మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఓవర్ హెడ్‌లకు నీళ్ల ప్రతి రోజు పంపింగ్ చేసేటప్పుడు ప్రధానంగా లీకులు ఎర్పడటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లీకులు నివారించేందుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తునప్పటికి వాటిని అరికట్టలేకపోతున్నారు.

రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఊసేలేదు

బాపట్ల పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఒక సమ్మర్ స్టోరేజీ ట్యాంకు మాత్రమే ఉంది. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు ప్రయత్నించారు. 100 ఎకరాల్లో రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం చేపడితే నీటి సమస్య తీరిపోతుందని ప్రయత్నాలు చేశారు.

రూ.15 కోట్లతో ఫిల్టర్ బెడ్ నిర్మాణం

మహా నేత డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో రూ.15కోట్లలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి వచ్చే మంచినీటిని శుద్ధి చేసేందుకు ఫిల్టర్ బెడ్ నిర్మాణం, కొన్ని ప్రాంతాల్లో అంతర్గత పైపు లైన్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి లీకులు నివారించి కొత్త పైపు లైన్లు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ హామీలు తక్షణమే నెరవేర్చాలి

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానం



కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

తెనాలి: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను తక్షణమే అమలుచేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యవర్గ సమావేశం తీర్మానించింది. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో సోమవారం ఏర్పాటైన తొలి సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, సమన్వయకర్తలు దొంతిరెడ్డి వేమారెడ్డి, అంబటి మురళీకృష్ణ, బలసాని కిరణ్‌కుమార్, తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్‌వలి, సంయుక్త కార్యదర్శి మెట్టు వెంకటప్పారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు మాట్లాడారు. సమావేశంలో వచ్చిన ప్రతిపాదనలతో అంబటి రాంబాబు తీర్మానాలను ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అమలు చేశామని చెబుతున్న ఏడాదికి మూడు సిలెండర్ల పథకంలో కేవలం ఒక సిలెండరు మాత్రమే ఇచ్చారని, ఆర్థికసంవత్సరం లోగా మిగిలిన రెండు సిలిండర్లను ఇవ్వాలని కోరుతూ మరో తీర్మానం చేశారు. ప్రతినెలా ఒక నియోజకవర్గంలో కార్యవర్గ సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. పార్టీ నూతన కార్యవర్గంలో నియమితులైన జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, లీగల్ సెల్, రైతు కమిటీ, ఎస్సీ సెల్ వంటి అనుబంధాల సంఘాల నేతలు పాల్గొన్నారు.

డాక్టర్ రంగిశెట్టి రమేష్‌కు తెలుగువెలుగు సాహితీ పురస్కారం



డాక్టర్ రంగిశెట్టి రమేష్‌కు పురస్కారం ప్రదానం

తెనాలి: తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో తెనాలికి చెందిన కవి, రచయిత డాక్టర్ రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ)కి తెలుగు వెలుగు సాహితీ సేవా పురస్కారం స్వీకరించారు. ప్రస్తుత అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, అధికార భాషా సంఘం సభ్యుడు కత్తి వెంకటేశ్వర్లు, తెలుగు వెలుగు సంస్థ ఛైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ చేతులమీదుగా సత్కారం జరిగింది. ఇదే వేదికపై రమేష్ రచించిన 'గంగాహారతులు', 'శస్త్రాలు' పుస్తకాలను మండల బుద్ధప్రసాద్, కత్తి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌ను పలువురు రచయితలు, కవులు అభినందించారు.

వేడుకగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



గుంటూరు రూరల్: గోరంట్ల అన్నపూర్ణనగర్‌లోని లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 21వ వార్షిక బ్రహోత్సవాలు నాలుగో రోజు కనులపండుగగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగాయి.

స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ధ్వజారోహణ, తీర్థ ప్రసాద వితరణ, పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ బ్రహోత్సవాల్లో భాగంగా స్వామికి సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. మధ్యాహ్నం మహాన్నదానం నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని సమీప గ్రామాలకు చెందిన 20వేల మందికిపైగా భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదం స్వీకరించారన్నారు. నాలుగు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయని వెల్లడించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

వేమూరు: మద్యం దుకాణాల్లో కల్లు గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాలున్నాయి. వేమూరు నియోజక వర్గంలోని చుండూరు, అమర్తలూరు కల్లు గీత కులాలకు కేటాయించడం జరిగిందన్నారు. కల్లు గీత కులాలకు చెందిన వ్యక్తులు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

మద్యం విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: మద్యం సీసాలను అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన మండలంలోని చోడాయపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ వివరాల మేరకు చోడాయపాలేనికి చెందిన గొట్టిపాటి బాబూరావు అక్రమంగా మద్యం నిల్వ ఉంచాడన్న సమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. అతని గృహంలో ఆఫీసర్ చాయిస్ 180 ఎంఎల్ మిల్లీలీటర్ల మద్యం సీసాలు ఏడు లభించాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు.

నేడు రథ సప్తమి వేడుకలు

జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో ఉన్న చెన్న కేశవ స్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం వార్షిక పూజా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అర్చకులు శ్రీనివాసమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యక్ష దైవం సూర్య భగవానుని లోహమూర్తికి పంచామృత అభిషేకం, విశేష పూజల అనంతరం భక్తులు సూర్య నమస్కారాలు చేశారు.

శ్రీసాయిక్షేత్రంలో వసంత పంచమి



పూజలో పాల్గొన్న భక్తులు

తెనాలి: వసంత పంచమి పర్వదినం సందర్భంగా రూరల్ మండల గ్రామం నందివె లుగులోని శ్రీసాయి క్షేత్రంలో శ్రీగాయత్రి అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేశారు. విశిష్టమైన పూజ, అర్చన కార్యక్రమాలను వైభవంగా జరిపారు. అమ్మవారికి సుగంధద్రవ్యాధి పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం, మణిద్వీప వర్ణన పూజార్చనలో పలువురు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. శ్రీసాయిబాబా వారి మధ్యాహ్న హారతి తదుపరి అందరికీ తీర్థ ప్రసారాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సంధ్య హారతి అనంతరం బాలబాలికలతో సరస్వతి అమ్మవారి సన్నిధిలో పూజార్చన నిర్వహించి, పూజలో వుంచిన నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష ప్యాడ్స్, బిస్కట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. పిల్లలందరికీ అమ్మవారి కంకణం కట్టి ఆశీర్వచనం అందజేశారు. షిరిడీ సాయి స్వచ్ఛ సేవ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ ఎంపీ హరిప్రసాద్ రావు, కార్యదర్శి శ్రీవల్లి అన్నపూర్ణ, శారద చలపతి, పద్మావతి కుమారి, పార్వతి, కోటేశ్వరమ్మ, శుభశ్రీ ,నాగలక్ష్మి, సాంబ శివరావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

పోస్టల్ కార్మికుల కోసం పోరాడిన డీఎస్ఎన్



శివనాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళి

తెనాలి: కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఉద్యమనేత దేవిరెడ్డి శివనాగేశ్వరరావు (డీఎస్ఎన్) చిరస్మణీయుడని ఫ్రెండ్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.పోలేశ్వరరావు అన్నారు. ఇటీవల హఠాన్మరణం చెందిన పోస్టల్ ఉద్యోగుల నేత డీఎస్ఎన్ సంతాప సభను సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని అసోసియేషన ఆవరణలో నిర్వహించారు. అధ్యక్షత వహించిన పోలేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం వేలాదిమందిని సమీకరించి ఢిల్లీలో పోరాటం చేసిన డీఎస్ఎన్, వారికి కొన్ని హక్కులను సాధించగలిగారని సోదాహరణంగా చెప్పారు. అంతేకాకుండా క్రెడిట్ సొసైటీతో పోస్టల్ ఉద్యోగులకు ఎంతగానో మేలుచేశారని తెలిపారు. సీపీఎం నేత ములకా శివసాంబిరెడ్డి, రైతుసంఘం సభ్యురాలు శివకుమార్, ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్‌కు చెందిన యు.సత్యనారాయణ, విశ్రాంత పోస్టల్ ఉద్యోగి వీవీ సుబ్బారావు, ఎస్.నరసింగరావు, వై.రమేష్‌బాబు, ఎ.సత్యనారాయణ, అంబటి సీతారామయ్య మాట్లాడారు. తొలుత డీఎస్ఎన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

విద్యతోనే ఉజ్వల భవిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణతేజ

కాకుమాను: విద్యతోనే ఉజ్వల భవిత సిద్ధిస్తుందని ఐఏఎస్ అధికారి, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఎం.వి.ఆర్ కృష్ణ తేజ అన్నారు. పెదనందపాడు మండలంలోని నాగులపాడులోని శ్రీనివాస పబ్లిక్ స్కూల్ 38వ వార్షికోత్సవం, సీబీఎస్‌సీ ప్రారంభోత్సవం సోమవారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కృష్ణతేజ మాట్లాడుతూ కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. 393 మంది తల్లి దండ్రులను కోల్పోయిన విద్యార్థులను దాతల సాయంతో తాను చదివిస్తున్నట్టు వివరించారు. పాఠశాల గౌరవ అధ్యక్షులు దాసరి శేషగిరిరావు, అధ్యక్షులు నర్రా బాలకృష్ణ,సెక్రటరీ విద్యా సాగర్ గుప్తా, ప్రిన్సిపల్ కె.శాంత కుమారి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



బాపట్ల: బాపట్ల పట్టణంలోని ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కొనసాగిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జీబీసీ రోడ్డులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు. కార్మికులు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో చెత్తచెదారం తొలగించడం, డ్రెయినేజీలో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. చెత్తాచెదారం తొలగించిన తరువాత దోమలకు ఫాగింగ్ పనులు చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు ఉన్నారు.

వైభవంగా వసంత పంచమి వేడుకలు

రేపల్లె రూరల్: సరస్వతీదేవి పుట్టిన రోజును పురస్కరించుకుని నిర్వహించే వసంత పంచమి వేడుకలు పట్టణంలోని రామకృష్ణ విద్యానిలయంలో వాసవీ వనిత క్లబ్ సహకారంతో సోమవారం వైభవంగా నిర్వహించారు. పాఠశాలలోని సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ సభ్యులు ప్రభల సుబ్రహ్మణ్యం, మల్లెల రామచంద్రరావు, మద్ది పద్మజ, ఎంబీఎల్ నారాయణమూర్తి, వాసవీ క్లబ్ వనిత ప్రెసిడెంట్ నగరాజా, సెక్రటరీ నాగలీల, ట్రెజరర్ వై.పద్మజ, డిప్యూటీ గవర్నర్ ప్రసాద్, రమా మాతాజీ పాల్గొన్నారు.

కుమార్ పంప్స్‌లో రక్తదాన శిబిరం

తెనాలి: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ పంప్స్ ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫ్యాక్టరీ సిబ్బంది శిబిరంలో పాల్గొని వంద యూనిట్లకుపైగా రక్తదానం చేశారు. ముఖ్యఅతిథులుగా మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి పాల్గొన్నారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం సతీమణి వసుంధర జన్మదినాన ఏటా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేయటం అభినందనీయమన్నారు. రక్తదానంతో ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడే అవకాశం ఉందని గుర్తుచేశారు. కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, జి.శేషగిరిరావు, కె.శ్రీనివాస్, కె.కృష్ణకుమార్, కె.హరికుమార్, కె.శేషుకుమార్, సంస్థ ప్రతినిధులు పర్యవేక్షించారు.

వైభవంగా కల్యాణోత్సవం

తెనాలి: అంగలకుదురులోని శ్రీకోదండ రామసేవక ధర్మసమాజం (దాసకుటి)లో శ్రీఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాసస్వామి 163వ జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొలిరోజున శ్రీవాసుదాసస్వామి పాదుకలకు అభిషేకం, పూజాకార్యక్రమాన్ని నిర్వహించారు. రెండోరోజైన స్మోవారం శ్రీభూదేవి శ్రీదేవిసమేత శ్రీనివాసస్వామి కళ్యాణం, సీతారామకళ్యాణం, శ్రీమహాలక్ష్మి అమ్మవారి సామూహిక కుంకుమ పూజను ఘనంగా జరిపారు. పలువురు భక్తులు పాల్గొన్నారు. మంగళవారం శ్రీరమాసహిత సత్యానారాయణస్వామి వ్రతం జరుగుతుందని, భక్తులు విరివిగా పాల్గొని ఆచార్య అనుగ్రహానికి పాత్రులు కావాలని నిర్వాహకుడు ఉలిచి సీతారాంశర్మ పట్టాభి విజ్ఞప్తిచేశారు.

పాఠశాలను విలీనం చేయొద్దు




మున్నంగి(కొల్లిపర): మున్నంగిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్)ను వేరొక పాఠశాలల్లో విలీనం చేయొద్దని పాఠశాల కమిటీ ఛైర్‌పర్సన్ సంజిదా సుల్తానా, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల విద్యా వనరుల కేంద్రంలోని అధికారులకు వినత పత్రం అందజేశారు. పాఠశాలను ఊరిలోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ఆనంద్ , ఎస్.సౌజన్య , ఎ.సీతామహాలక్ష్మి , వి.శ్యామ్ , ఎం.సుశీల, బి.కృష్ణవేణి , ఎం.సుప్రియ, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

• కోడ్ కూటమికి ఫ్లెక్సిబుల్



రేపల్లె మార్కెట్ సెంటరులో భారీ టీడీపీ ఫ్లెక్సీలు



నగరం మండలం మంత్రిపాలెంలో..

రేపల్లె రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను నిష్పక్షపాతంగా అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంలో నియోజకవర్గంలో ప్రధాన సెంటర్లలోని రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసి, పలు ఫ్లెక్సీల బ్యానర్‌లను తొలగించారు. అయితే నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే రేపల్లె పట్టణంలోని మార్కెట్ సెంటరులో ఉన్న భారీ టీడీపీ ఫ్లెక్సీలను తొలగించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. నగరం మండలం మంత్రిపాలెంలోని సాక్షాత్తు పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న బ్యానర్‌లు సైతం తొలగించలేదు. అదే గ్రామంలో మరికొన్ని చోట్ల టీడీపీ ఫ్లెక్సీలు నేటికి దర్శనమిస్తూనే ఉన్నాయి. నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను అత్యుత్సాహంతో తొలగించిన అధికారులు టీడీపీ ఫ్లెక్సీలను చూసీ చూడనట్లు వదిలివేయడంతో ఎన్నికల కోడ్ అమలవ్వడం లేదు. స్థానిక టీడీపీ నాయకుల మెప్పు పొందేందుకు అధికారులు పచ్చపాతంగా వ్యవహరించడంతో ప్రజలు, ప్రజా సంఘాలు అధికారుల తీరును విమర్శిస్తున్నారు.

వైభవంగా భావనా ఋషిస్వామి ఊరేగింపు



రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు గ్రామంలో వేంచేసియున్న భద్రావతి సమేత భావనా ఋషి స్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులి వాహనంపై ఉత్సవ మూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగింపు చేశారు. భక్తులు హారతులుపట్టారు. అదేవిధంగా రేపల్లె ఓల్డ్ టౌన్‌లోని భావనా ఋషిస్వామి ఆలయంలో వేడుకల్లో భాగంగా అన్నసంతర్పణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.